# తెల్లకాకి

ఆఫీసరు గదివైపు వెళుతున్న సత్యమూర్తికేసి హేళనగా చూస్తూ, తోటి ఉద్యోగుల్లో కొందరు అపహాస్యంగా మాట్లాడుకోసాగారు.

ఉద్యోగంలో చేరి మూడేళ్ళయినా మనవాడికి జ్ఞానోదయం కాలా! ఆ సీట్లో యింతకు ముందున్న రామారావు ఆరేళ్ళలో మూడంతస్తుల మేడ కట్టాడు. మనవాడు ఏడాది దాటుతున్నా అద్దెకొంప వదల్లేదు.

"మనవాడు త్రేతాయుగపు సరుకురా బాబూ! నేను రెండు మూడు మాట్లు ఉపాయంగా హెచ్చరించినా విన్నాడు కాదు. పైగా పాపం పుణ్యం అంటూ భగవద్గీతంతా నాముందు ఏకరువు పెట్టాడు..."

"గడ్డి దగ్గర కుక్కలాంటివాడు, తను తినడు, ఇంకోణ్ణి తిననివ్వడు. ఆఫీసరు గార్కి కూడా మనవాడి మీద కోపంగా వుందని వినికిడి. అందులో యీయన కొత్తగా వచ్చిన ఆఫీసరు కదా, కాస్త మంచి చేసుకోవాలనేనా వుండదేమిరా యీ శుంఠకి."

"ఉంటే శుంఠ ఎందుకవుతాడు?" నవ్వులు.

000

ఆఫీసరు సత్యమూర్తి కేసి 'ఎక్స్‌రే' తీస్తున్న వాడిలా కొద్ది సెకన్లు చూశాడు. తర్వాత కాఫీని చప్పరించి మెల్లగా అన్నాడు.

"మీరీ రెండు రోజుల్లో రెండు వందల మంది పెన్షనర్ల కాగితాలు 'అప్రూవల్' కోసం నాకు పంపించారు" ఆగి సిగరెట్ వెలిగించుకున్నాడు.

ఒక్కొక్కళ్ళకీ అరియెర్స్‌గా నలభై వేల పైచిలుకు వస్తోంది. మనిషికి వెయ్యిచొప్పున యిచ్చినా”

“రెండు లక్షలు” వాక్యం తనే పూర్తి చేశాడు సత్యమూర్తి.

ఆఫీసరు ఆశ్చర్యంగా చూశాడు.

“వెయ్యి రూపాయలు కాదు కనీసం వెయ్యి పైసలు కూడా నేను తీసుకోలేదు. తీసుకోను కూడా”

“అదే..ఎలా నమ్మటం? ఈ రోజుల్లో మీలాంటి వాళ్ళు”

“తప్పకుండా ఉన్నారు సార్! అలా వుండబట్టే నేనీ ఉద్యోగం చెయ్యగలుగుతున్నాను..”

“వాట్!” అర్థం కానట్లు చూశాడు.

“అవును సార్!” గతంలోకి తొంగిచూస్తున్న వాడిలా చెప్పాడు” ఆ సంఘటనని నేను జీవితాంతం మర్చిపోలేను. ఆయనా మీలాంటి ఆఫీసరే... పేరు నరసింహం. గవర్నమెంటు ఉద్యోగానికి నేను హాజరయిన చిట్టచివరి ఇంటర్వ్యూ అదే. ఆ తరువాత నాకు వయసు దాటిపోతుంది. ఇంటిదగ్గర పక్షవాతంతో మంచం పట్టిన నాన్నగారి మాస్టరు గిరీ ఆదాయం కూడా లేకపోవటంతో ఆకలి మమ్మల్ని వేటాడుతున్న రోజులవి. ఇంటర్వ్యూలో అన్నింటికీ తృప్తికరంగా సమాధానాలు చెప్పాను.

ఆయన నన్ను సెలక్టు చేసినట్టు ఎదురుగానే చెప్పారు. అదే నిమిషంలో టెలిఫోను మోగింది. షరా మామూలే. టెలిఫోను సంభాషణను బట్టి రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తి నుండి ఒత్తిడి వస్తున్నట్టు గ్రహించాను. నాకు ఆశలు అంతరించాయి. నిస్పృహ ఆవరించి, నరసింహం గారు నా కవళికలు గమనిస్తూ ఫోనులో “సారీసర్! క్యాండిడేట్‌ని సెలెక్ట్ చేసేశాను. ఇప్పుడు కాన్సిల్ చేయడానికి వీలుకాదు” అని చెప్పి, లైన్ కట్ చేశారు. ఆశ్చర్యపోతున్న నాకేసి చిరునవ్వుతో చూసి, “డోంట్‌వర్రీ! ఈ ఉద్యోగం నీదే. ఇప్పుడే ఆర్డరిస్తాను. రేపే వచ్చి చేరు” అని అప్పటికప్పుడు ఆర్డర్స్ రెడీ చేయించి, సంతకం చేసి యిచ్చారు. మర్నాడు నేను వచ్చి చేరటం, అదేరోజు సాయంత్రం ఆయనకు టెలిగ్రాం మీద బదిలీ కావటం జరిగిపోయింది. ఆయన్ని పనిష్మెంట్ పోస్టింగ్ క్రింద దూర ప్రాంతానికి వేశారు. వెళ్ళేముందు కన్నీళ్ళతో వీడ్కోలు చెబుతున్న నాతో ‘సత్యమూర్తీ! వేయి నల్లకాకుల మధ్య ఒక తెల్లకాకిలా బ్రతకటానికి చాలా ధైర్యం కావాలి. నల్లకాకులు అనుక్షణం అసూయతో ఆగ్రహంతో మనల్ని వేధిస్తూ బాధిస్తూనే వుంటాయి. అవినీతి బలంతో అవి చేసే ఆర్భాటాలకు మనం ఏమాత్రం బెదిరినా అవి రెచ్చిపోతాయి. జాగ్రత్తగా వుండు. అలాగని పిరికిగా బ్రతక్కు..” అన్నారు. ఆ మాటలు వేదాక్షరాలుగా బ్రతుకుతున్నాను. పెన్షనర్ల కష్టాలు ఎలాంటివో నాకు బాగా తెలుసు. మా నాన్నగారి పెన్షను కోసం మేం పడిన కష్టాలు అన్నీ యిన్నీ కావు. నేనిప్పుడు ఆ సీటులోనే వున్నాను.

ఎందరో ఎన్నో ఆశలతో, ఎన్నో సమస్యలకి పరిష్కారాన్ని ఈ డబ్బుతో ముడిపెట్టుకుని వస్తారు. అందులోని ప్రతిరూపాయి వెనక సంవత్సరాల తరబడి పడిన శ్రమ, ఆ శ్రమలో ప్రవహించిన రక్తస్వేదాల మూగరోదన వుంటాయి సార్! నా కష్టానికి ప్రతిఫలంగా జీతం వస్తోంది సార్! అది చాలు నాకు. దానితో తృప్తిపడలేకపోతే, మీరన్నట్లు రెండు లక్షలే కాదు ఇరవై లక్షలు కూడా నన్ను తృప్తిపరచలేవు. రెండురోజుల్లో రెండు వందల మంది పెన్షను కాగితాలు సిద్ధం చేయగలగటం మీకు ఆశ్చర్యము, అనుమానమూ కలిగించటంలో వింతలేదు. నేను నిజంగానే శ్రమించాను. కానీ, అందులో నాకెంతో ఆనందం, తృప్తీ కలిగాయి. ఇంకా మీకు నమ్మకం లేకపోతే నామీద నిఘా ఉంచి ఒక్క కేసులో మీరు పట్టుకున్నా తక్షణం రాజీనామా చేస్తాను సార్."

"అవసరం లేదు. రెండు వందలమంది కాగితాల్ని సిద్ధం చేయటానికి మీరు పడిన శ్రమ ముందు, రెండు వందల సంతకాలు చేయడానికి నేను పడే శ్రమ చాలా తక్కువ. మీ సీటుకి వెళ్ళి పని చూసుకోండి. కాగితాలు సంతకాలు చేసి పంపిస్తాను..." ఫైలు ముందుకి లాక్కున్నాడు ఆఫీసరు.

*(జాగృతి కథానికల పోటీలో బహుమతి పొందిన రచన)*